6 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 27 ఏప్రిల్ 2025
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# గొడ్డుకెరుక.. గోదకెరుక..



రాజేంద్రప్రసాద్ చేలిక
99858 35601

ఒడువని ముచ్చట.. తీరని గోస.. పదంపై దాడి.. పాదం మీద దాడి. భాషకు ఈసడింపు.. గోసికి ఎక్కిరింపు. పనికి పరాచికాలు.. తిండికి పేర్లు పెట్టడాలు. పైర్లు పాడెక్కించిన తీరు.. రైతును రోడ్డెక్కించిన ఘోరం. పెద్ద కొలువుల్లో వాళ్లు.. చెపరాసి సీట్లలో వీళ్లు. తిండిక్కడిది.. పాటక్కడిది. బొగ్గులిక్కడ.. బుగ్గలక్కడ. కాల్వతవ్వకాలీడా.. నీళ్ల పార్కం ఆడ.

గుడిసెకు దిక్కులేదు.. మెతుక్కు హక్కులేదు.. భవంతులకు ఢోకా లేదు.. భోగాలకు అడ్డూఅదుపు లేదు. చెప్పుకొంటాపోతే గుక్కతిప్పుకోలేని తీరు.. తల్చుకుంటూ కూసుంటే మాటరాని ఘోరం. అన్నీ చూసిన ఆయన (కేసీఆర్) అరిగోసను దిగమింగిండు.. ప్రాణాలుపోయినా సరే సాధించాలని బైలెల్లిండు. కాళ్లల్లో కట్టెలను దారికి ఊతంగా వాడుకుంటూ.. సూటిపోటి మాటలను ఫిరంగి గుండ్లుగా మల్చుకుంటూ.. పళ్లికిలించిన వారికి చెంపచెళ్లుమనేలా చేసి.. బొక్కబోర్లపడేలా చేద్దామనుకున్నవారిని ముక్కున వేలేసుకునేలా మార్చి.. అనుకున్నది సాధించి.. కలగన్నది తీర్చిదిద్ది.. బక్కతనం పల్చన కాదు.. బలుపుతనం మందమూ అవ్వదని రాష్ర్టాని తెచ్చి.. రచనా పర్వానికి తెరతీసి నాలుగు కోట్ల యావత్ తెలంగాణ బిడ్డలకు దిక్సూచిగా నిలిచిన ఒకే ఒక్కడు.. పాతికేండ్ల పండుగకు నిలువెత్తు నిజస్వరూపుడు.. గోసపడుతున్న పడావు భూముల్లో పచ్చని రంగులు పులిమి శ్వాస నిలిపిన దేవుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.

గొడ్డుకెరుక.. గోదకెరుక..
ఒడ్డున పరవశించే పచ్చి గడ్డికెరుక..
తుమ్మలు మొలిచిన కాల్వలకెరుక..
అందున పారుతున్న నీళ్లకెరుక..
వాగున ఊరుతున్న చెలిమెకెరుక..
నోళ్లు తెరిచిన బీళ్లకెరుక..
ఇరాము లేకుండా పోస్తున్న మోటరుకెరుక..
ఇంటికొచ్చి దించుతున్న వైద్యబృందానికెరుక..
ఆడపిల్ల నుదిటి బొట్టుకెరుక..
ఆసరాగా నిలిచిన ముసలవ్వకెరుక..
పొలంలోని వరి పైరుకెరుక..
పక్షికెరుక.. పశువుకెరుక..
పువ్వుకెరుక.. చిరునవ్వుకెరుక..
యావత్ తెలంగాణ సమాజానికెరుక..
పుట్టింది తెలంగాణ కోసమే అని..
కేసీఆర్ సంకల్పం సమస్త జనాలకై అని..
మచ్చలు రావొచ్చుగాక.. మరకలు అంటొచ్చుగాక..
కాసిన చెట్టుకే దెబ్బలు సహజం అన్నట్టుగా..
చేసిన అయ్యకే నిందలూ సర్వసాధారణం.
బతుకమ్మ దీవెనలతో..
సమక్కసారలమ్మలిచ్చిన ధైర్యంతో..
యాదాద్రి నృసింహుడి ఆశీస్సులతో..
గులాబీ వర్ధిల్లాలి.. గులాబీ వికసించాలి..
పాతికేండ్ల పండుగతో గతవైభవ
ప్రభను తిరిగిపొందాలి.

ఊహ కందనిది.. ఊహల్లోలేనిది. ఏమోలే ఎన్నో వచ్చాయి.. పోయాయి.. ఎందరో ఎగిరారు.. ఎల్లెలుకల పడ్డారు. అందులో ఇదొకటి. ఎన్ని చూళ్లేదు. ఏదో ఆవేశంగా పెట్టాడు.. ఆ తర్వాత నాలుక్కర్చుకుని అంతకన్నా వేగంగా కాలగర్భంలో కల్వడం. ఇదీ అంతే... కలుస్తాడు.. కలిసి తీరుతాడు. ఆలోచించాల్సిన అవసరం లేదు.. అంతగా పట్టించుకోవాల్సిన విషయమూ కాదు. అంతా మనమే.. అన్నింట్లో మనోళ్లే. అసలే బక్క మనిషి (బక్క పీనుగ అన్న సందర్భాలూ కోకొల్లలు).. అందునా ఒక్కడంటే ఒక్కడే. అప్పటికే 1969లోని ఉవ్వెత్తు తరంగాన్ని 'స్వార్థపు గ్రహణం' మింగిన చేదు అనుభవం. ఆ దెబ్బతో జనం నైరాశ్యం చెందడం.. రాజకీయం కోసం పావుగా వాడుకుంటున్నారన్న నమ్మకం బహుబలంగా స్థిరపడటంతో వారనుకున్నట్టే అంతా భయం ఆవహించిన సమయం.

చరిత్రకు సిద్ధమైన క్షణాలివి. పండుగకు ఏర్పాట్లు జరుపుకొంటున్న సందర్భమిది. పురిట్లోనే పోతాడనుకున్న రోజుల బాలుడు మొండిఘటంగా మారి పోరాడి.. ప్రతిఘటించి.. నిలిచి.. గెలిచి.. సాధించిన తీరు అప్రతిహతం. సాగరహారం.. మిలియన్ మార్చ్.. సకలజనుల సమ్మె.. పది లక్షలకు పైగా జనసమీకరణతో దద్దరిల్లిన ప్రకాశ్‌రెడ్డిపేట సమావేశాలు.. ఇలా ఒక్కటేమిటి కాంక్షను దశదిశలా చాటిన పోరు తెలంగాణం ఆది నుంచి సాధింపు వరకు ఓ చరిత్ర పుటే. నాటి నైజం నుంచి నేటి అంకుశాన్ని లాక్కున్న సీమాంధ్ర మదపుటేనుగు వరకు కలియబడ్డ తీరు ప్రత్యేకమేనాయె. అసలు ఆ మాటకొస్తే చరిత్ర అనే పదం చాలా చిన్నదే.. అప్పుడెప్పుడో తేలిపోయినదే. భవిష్యత్తు కోసం వర్తమానాన్ని నేర్పుతో ఒడిసిపట్టి అనుకూలంగా మలుచుకుంటూ చరిత్ర సృష్టించిన ఆ బక్కపల్చని మేధావితనం రంగప్రవేశం చేసిన తర్వాత ఆ హిస్టరీయే సాష్టాంగపడి సంబురపడిన ఘడియలు లెక్కకు మిక్కిలి.

అంతా ఎక్కడికక్కడ తొక్కేయాలనే బలం.. డబ్బుతో కొనే బలుపు.. పదవులతో కొట్టే విభేదం.. అన్నింటికి మించి ఏనుగు వంటి మహాద్భుతమైన గతానికి ముసుగులు వేసి, అక్షరాలకు దీపపు మసి బారేలా చేసి తిమ్మిని బమ్మిగా.. నిజాన్ని అబద్ధంగా మలిచిన కపటం ఆరు దశాబ్దాలు కులికిన తనం. లౌక్యంగా దరి చేరి.. మావటిని మాటల్లో పెట్టి, అతి తెలివిగా అంకుశాన్ని కైవసం చేసుకుని తరతరాలుగా తరగని ఆశలతో తంతెలు తంతెలుగా స్వారీ చేయడానికి మరిగిన ఆ బాపతు వాళ్లు పేట్రేగిన తరుణం. ఇక్కడున్నోళ్లను ఒక్కటి చేయలేక.. అంత బలమైన మందగా ఉన్న ఆడోళ్లతో ఒక్కడిగా నెట్టుకురావాల్సిన అతి భయానక సందర్భం. అన్నింటినీ దిగమింగుకుంటూ, కనిపించిన దారంటే నడుస్తూ అప్పుడప్పుడే మొగ్గలేస్తున్న గులాబీకి ముల్లు గుచ్చి ఛిద్రం చేయాలనుకుని కాచుక్కూర్చున్న సీమాంధ్ర రాజ్యం అది.

పుట్టడానికే ఆపసోపాలు పడిన ఘడియలు. 'పురిట్లోనే పిసికేస్తాం లే' అని గోతికాడి నక్కల్లా కూర్చున్న 'రియల్' రుబాబులు.. తండ్రులు, తాతల తరాల నుంచి రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తున్న బాబులు.. రంగుల తెరపై మెరుస్తూ పెట్టుబడులతో 'హిల్స్' ఎక్కి నాట్యం చేస్తూ.. అన్నింటినీ తొక్కేస్తూ అందనంత ఎత్తుగా ఎదిగిన తెర అనకొండలు.. మన ప్రకృతిని కూడా వికృతంగా చూపుతూ, తాము తప్ప దిక్కెవరు లేరనే ప్రచారాన్ని ముమ్మరం చేసి, ఇక్కడిదంతా మరుగుమందు.. తమకాడిదంతా మెరుగైన విందుగా కలరింగ్ ఇస్తూ వేళ్లూనుకున్న వికటాట్టహాసం. అన్నీ ఆ చేతుల్లోనే, అవాస్తవాన్ని కూడా అందంగా ముస్తాబు చేసి అర్ధరాత్రుళ్లు ప్రపంచమంతా చుట్టేసి వచ్చేన్ని సౌకర్యాలు ఆ కోటలిలోనివే. అయినా అధైర్యపడని తనమే మనోడి బలం.

ఎన్నో చేదు గుళికలు. అన్నింటికన్నా ఏకాకి బాటసారి జీవితం. పెట్టుబడికి కాదు కదా, జేబు ఖర్చులకు కూడా లేని దయనీయం. వచ్చిన ఆలోచనను చావకుండా, తనెవరు ఏమన్నా పర్లేదు అన్నట్టుగా.. ముందు తరాల




కోసం తొవ్వైతే వేస్తాను.. నడువనైతే నడుస్తాను.. సాధిస్తానో.. చస్తానో తెలియదు కానీ, నడక ఆపేది లేదని బైలెల్లిన ఆ పల్చని తనువు సంకల్పం కాలక్రమేణా పటుత్వం సంపాదించిన తీరు అమోఘం. రాత్రికి రాత్రో, ఉన్నపళంగానో వచ్చింది కాదని తరచి చూసిన వారందరికి తెలిసిందే. ఇనుప కంచెలు.. ఉక్కు చెరలను దాటుకుంటూ, ఒక్కో మెట్టు ఎక్కుతూ, ఆ ఒక్కడితో పదులు.. వందలు.. వేలు.. లక్షలు.. ఆఖరుకు కోట్లలోనే కాదు సమస్త తెలంగాణ సమాజం వెంట నడిచే స్థాయికి తీసుకెళ్లిన తీరు అమోఘం. అణువణువు ఆకాంక్షను పులుముకుని, అందరిలో తెలంగాణ వీరత్వాన్ని నింపి ముందునడిచిన తీరు యావత్ ప్రపంచ చరిత్రలోనే తరచిచూసినా కనిపించని ఓ అమోఘఘట్టం.

అడుగు పడింది.. నడక సాగింది.. పరుగు లంఘించుకుంది.. అనుకున్నది చేసి చూపించింది. ఒక్కటిగా.. ఒక్కడిగా మొదలైతేనేమి నేడు పాతికేండ్ల పండుగ వరకు సాగిన ప్రస్థానం మహాద్భుతం. ప్రేమలు చిగురించేలా చేసిన గులాబీ నేడు పవిత్ర కార్యానికి సిద్ధమైంది. రాజకీయాలు కాదు, రాక్షసానందం అంతకన్నా లేదు. అంతా ఆ పువ్వు రెమ్మలే, అన్నీ ఆ రంగు పువ్వులే. బతుకు జీవుడా అన్న స్థాయి నుంచి బతుకిదిరా.. అనే రేంజ్‌కు తీసుకెళ్లిన కేసీఆర్ తీరు ఎంత చెప్పినా తక్కువే. నాడు హనుమకొండ కాకతీయ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో రెండో మూడో జీబులు.. నలుగురో ఐదుగురో వెంటున్నవారు. అసలు అక్కడికి కేసీఆర్ వచ్చారా.. అనేలా అనుమానంగా.. అంతగా పట్టించుకోని దుస్థితి. ఎక్కడి జలదృశ్యం మరెక్కడి ఎల్కతుర్తి. ఇరవై ఐదేండ్ల ప్రయాణంలో ఆటుపోట్లను అధిగమించి, అనుకున్నది సాధించిన చంద్రశేఖరుడు తెలంగాణ సమాజానికి ఓ దిక్సూచి.. ఎవరూ అనుమానించాల్సిన అవసరం లేని ఓ కలికితురాయి. ఒక్కసారి పీక పిసికితే ఇగ కనిపించడని, పనైపోతుందని సీమాంధ్ర పైశాచికం ఉవ్విళ్లూరుతున్న వేళ ఆవేశకావేషాలను అదిమిపట్టుకుని తన కోసం కాదు, వెనకున్న అమాయక జనం కోసం ఎంతకైనా అన్నట్టుగా నిలిచిన ఆయన తీరు ఇప్పుడు ప్రతి పల్లెలో కనిపిస్తున్న దృశ్యాల సమాహారమే.

**వెల్‌కమ్ ఎల్కతుర్తి..**
**ఆల్ ది బెస్ట్ టూ పింక్ ఫెస్టివల్..**
**గుడ్ లక్ గులాబీ బాస్..**

# అయుటి అదును కోసం.. చలో వరంగల్



వర్దెల్లి వెంకటేశ్వర్లు

కాలాలు అనేకం.. ఎప్పటికీ ఒకటే కాలం ఉండదు.. కలికాలం. కరువు కాలం. కలవని కాలం. నిలువని కాలం. విభ్రమల కాలం. బేల చూపుల కాలం. భ్రమలు తొలిగిపోయిన కాలం. కదిలే కాలం. కదిలించే కాలం. అధిక్షేపించేకాలం. అన్వేషించే కాలం. పరిష్కారాలను వెతికే కాలం. అగో ఆ కాలమే ఇప్పుడొచ్చింది. చలో వరంగల్లు అంటున్నది. మోసపోయిన తనువుల వ్యథ యేందో మాట్లాడుకుందాం రా బిడ్డా అని పిలుస్తున్నది. వందలు.. వేలై..జనం జాతరై పోదాం. సంయమనంతో, సహృదయతతో బాపు చెప్పే ముచ్చట విని వద్దాం.

కాలమానం ఎట్లున్నా చలనశీలమే దాని ధర్మం. కాల గమనంలో ఆశలు.. ఆకాంక్షలు.. ఆశయాలు. హామీలను తనలో కలుపుకొని సాగిపోతుంది. కాలగతిలో సర్వం అంతర్థానమైపోయినా.. ఇచ్చిన మాట ఒక్కటే కాల గమనంలో బతికే ఉంటుంది. అట్లా కాల గమనంలో తెలంగాణ జాతిపిత కేసీఆర్ అన్న మాటలను ఒక్కసారి మననం చేసుకోవాల్సిన కాలం వచ్చింది. 'నేను తెలంగాణ ఉద్యమం కోసం వెళ్లటం నాకొక ప్రొవకేషన్. తెలంగాణ సాధించానన్న కీర్తే వెయ్యి జన్మల పుణ్యంగా భావిస్తున్నాను. సంపాదించుకున్న తెలంగాణను చక్కదిద్దుకునే అవకాశం కల్గడమనే భాగ్యం కన్నా నా జీవితానికి మరేం కావాలి. తెలంగాణ అభివృద్ధి జరగాలనే యావ తప్ప మరో ఆలోచన లేదు.' అని 2014, జూన్ 10న తొలి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక సందర్భంగా తొలి ముఖ్యమంత్రి హోదాలో మాట చెప్పిన కేసీఆర్ రైతు సంక్షేమం,సాంకేతిక అభివృద్ధిని జోడెద్దుల తీరు పరుగులు పెట్టించారు. ఆకుపచ్చ తెలంగాణను రైతు చేతిల పెట్టారు.

16 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలని చెప్పి అధికారంలోకి వచ్చి కాళేశ్వరం, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల, నాగార్జునసాగర్, సీతారామసాగర్, రంగనాయకుల సాగర్, కొండపోచమ్మ, గడ్డెన్నవాగు, చలివాగు, జూరాల మొత్తం 12 ప్రాజెక్టులను పండబెట్టింది. 32 రిజర్వాయర్లను ఎండబెట్టింది. సాగును సర్వనాశనం చేసింది. రైతు సాగుబడి మళ్లీ వెనుకటి రోజులకు వెళ్లిపోయింది. కరెంటు బిల్లు కట్టలేదని సూర్యాపేట జిల్లాలో స్టార్టర్లు పీక్కపోయిండ్రు.

డ్వాక్రా రుణం కట్టలేదని బ్యాంకోళ్లు జనగామ జిల్లా మహిళల ఇంటి గేట్లు ఎత్తుకు ఎళ్లిండ్రు. హైడ్రాను తెచ్చి ఇండ్లు కూలగొట్టింది. ఇన్ని దుర్మార్గాలను ఇంతకాలం మౌనంగా గంభీరంగా చూస్తూ భరించిన కేసీఆర్ ఈ సభ తర్వాత ఏం చేయబోతున్నారు? ఇంత పెద్ద సభ ఎందుకు? మూడున్నరేండ్ల దాక ఎన్నికల్లేవు. 10 లక్షల మందితో కేసీఆర్ జైత్రయాత్ర దేనికి సంకేతం? ఛాయ్ కొట్టు దగ్గర ఇద్దరు కలిస్తే వరంగల్ సభ ముచ్చటే. పల్లెల్లో నలుగురు కూడితే రజతోత్సవ జాతర సంభాషణలే.

హైదరాబాద్ ఐటీ ప్రాంగణంలో దమ్ముకొట్టడానికి జత కూడిన టెక్కీల మధ్య ఓరుగల్లు కబుర్లే. సోషల్ మీడియాలో మోస్ట్ పాపులర్ సెర్చింగ్ పదం వరంగల్లు సభ. ఎందుకింత హైప్ వచ్చింది? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పమని చాట్ బాట్ 'గ్రోక్ ఐ'ని గోకిన. గ్రోక్ చెప్పలేక నోరెళ్ల బెట్టింది. కానీ, మా సొంత జిల్లా (సూర్యాపేట) పెన్‌పహాడ్ మండలం రత్యా తాండా రైతు భూక్యా నారాయణ నోరు తెరిచిండు. ''లేసిన, కూసున్న కేసీఆర్ అని మతిల తల్సుకుంట పంటలు పండించుకున్నం. లోళ్లు.. మిర్యాలగూడెం లోళ్లు పోతే బీట్లే (మార్కెట్లో) మొత్తం సీరియల్. అసుమంటి ఇయ్యాల పొలంల నుంచి ఇంట్లెకు తేవాలంటే బస్త సంచులతోటి మోయటానికి కూడా గతి లేకపోయింది''.తన అనుభవాన్నే ఆకాంక్షగా చెప్పిండు.



సకల జనుల సర్వే చేయించిన సీఎం కేసీఆర్, ఫలితాలు వచ్చిన తరువాత బడుగు, బలహీనవర్గాల రిజర్వేషన్ల మీద ఆలోచన చేశారు. తెలంగాణలో అగ్రకులాల సంఖ్య 15 శాతానికి లోపే ఉంటుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు 85 శాతం వరకు ఉన్నారని నిర్ధారించుకున్నారు. తమిళనాడు రాష్ట్రం 50 శాతం పరిమితిని దాటి 69 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తున్నదని, ఆ రిజర్వేషన్లను సపోర్టు చేసే యాక్ట్ నంబర్ 45/1994 కాపీ తమిళనాడు నుంచి తెప్పించి అధ్యయనం చేశారు. సిట్టింగ్ లేదా రిటైర్డ్ జడ్జి అధ్యక్షతన మన రాష్ట్రంలో కమిషన్ నియమించాలని ఆలోచన చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలకు రిజర్వేషన్లు అమలు చేయాలనుకున్నారు. కానీ అప్పటికి తెలంగాణ కేవలం రెండేండ్ల పసిగుడ్డు. ఇక్కడో సందర్భం గుర్తు చేయాలి. చావు నోట్లె తలపెట్టి కేసీఆర్ తెలంగాణ రాజ్యం తేనైతే తెచ్చిండు గానీ, అది వస్తూ వస్తూనే 5 వేల మెగావాట్ల విద్యుత్తు సంక్షోభాన్ని మూటగట్టి నెత్తి మీద పెట్టుకొని వచ్చింది. ఆగకుండ రైతు ఆత్మహత్యలు కొనసాగుతున్న ఆపదల రాజ్యంగా వచ్చింది. ఇప్పటి పాలకులు అప్పట్లో పరాయి పాలకుని పంచన చేరి పసిగుడ్డును పురిట్లోనే గొంతు నులిమి చంపేయాలని పన్నాగాలు పన్నుతున్న పాడుకాలం అది. ఎటుచూసినా సమస్యలు పరికకంప తీరు అల్లుకొనే ఉన్నయి. ముందుగా ఇల్లు పొతం చేసుకోకుండా, నడింట్ల తిష్ట వేసినట్టున్న సమస్యలను పరిష్కరించుకోకుండా రిజర్వేషన్లను ముందేసుకోవడం కాలయాపనే అవుతుందని తాత్కాలికంగా పక్కనపెట్టారు. వ్యాసకర్తగా ఇది నా వ్యక్తిగత అభిప్రాయం కాదు. 2014-16 శాసనసభ రికార్డులు తిరిగేస్తే ప్రతి అంశం స్పష్టంగా ఉంటుంది. ఇప్పటి పాలకులు తప్పుల తడకగా చేసిన బీసీ కుల గణన, రిజర్వేషన్ల గురించి గొప్పలు చెపుకోవటానికి తప్పితే, బీసీలకు ఇసుమంతైనా ఉపయోగం లేదు.

కేసీఆర్ తెచ్చిన నూతన పారిశ్రామిక విధానం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను, పారిశ్రామిక దిగ్గజాలను హైదరాబాద్‌కు పరుగులు పెట్టించింది. 12 ప్రధాన రంగాల్లో రూ.లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడంతో పారిశ్రామిక ఉత్పాదక జీడీపీ అత్యధికంగా 23 శాతం మైలురాయిని అందుకున్నది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పారిశ్రామిక పెట్టుబడులు అంటే దావోస్ చుట్టూ చక్కర్లు కొట్టడం, జపాన్‌లో పర్యటించటమే తెలుసు.

కేసీఆర్ ముందు చూపుగా చేసిన చెరువుల పునరుద్ధరణ ఉద్యమం తెలంగాణ హరిత విప్లవానికి పునాది అయింది.మిషన్ కాకతీయ అని పేరు పెట్టి 46 వేల చెరువుల పూడికతీసిండు. కూలిపోయిన మత్తడి గోడ మళ్లీ నిలబెట్టిండు. గోదావరి మీద కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి.. కృష్ణా మీద నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తిలను ఎత్తిపట్టి చెరువుతో సంధానించిండు. చెరువు చుట్టూ జల పెరిగింది. జలం ఇచ్చిన బలంతో కోటి ఎకరాల మాగాణిలో పచ్చదనం విచ్చుకున్నది. పచ్చబడిన చెట్టు మీద పిట్ట వాలింది. 'మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్' నివేదిక ప్రకారం... తెలంగాణలో 2012-13కు ముందు దిగుబడి వరిధాన్యం విలువ రూ.8,291 కోట్లు కాగా.. 2021-2022కు రూ.22,544 కోట్లకు పెరిగింది. పదేండ్ల కాలంలో దిగుబడి విలువ 150 శాతం మేర పెరిగింది. 2022 రబీ సీజన్‌లో 3 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. 2023 నాటికి 3.23 కోట్ల టన్నులకు పెరిగింది. ఇంత ధాన్యం తాము కొనలేమని ఓ దశలో కేంద్రమే చేతులెత్తేసింది. ఇగో ఇట్లా మీసం తిప్పిన రైతన్న ఇవాళ తిండి గింజలకు గతి లేదని భూక్యా నారాయణ దిక్కులు చూడటం రైతు సహజ సంఘర్షణ. సాగుబడి అంటేనే కాలంతో పాటు సాగిపోవటం. కరువు కాలంలో కన్నీళ్లు కార్చడం. ఆయుటి కోసం మళ్లీ ఎదురుచూడటం. తెలంగాణ రైతాంగం ఇప్పుడు ఆయుటి అదును కోసం ఎదురుచూస్తున్నది. చలో వరంగల్ అంటున్నది.

## మరో పోరాటానికి నాంది



ఉమ్మడి రాష్ట్ర పాలనలోతెలంగాణ సమాజం నాటి పాలకుల అలసత్వంతో అణచివేతకు గురైంది. కరువు- కాటకాలతో భూములు బీళ్లు వారడం, అతివృష్టి-అనావృష్టి, ఆకలి, అప్పులు, దారిద్ర్యం వెంటాడింది. మరోవైపు పంటకు కనీస గిట్టుబాటు ధర లేక రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. వందల మీటర్ల లోతు వరకు బోర్లు వేసినా, బావులు తవ్వినా నీటి చుక్క దొరకని దుస్థితి. తెలంగాణ ఎడారిని మరిపించింది. ఆంధ్రా వలసవాద పాలనలో మన బతుకులేమిటో, మన గమనం ఏమిటో తెలియని అయోమయ పరిస్థితి.

ఈ నేపథ్యంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను చూసి ఆవేదన చెంది ఒక వేగుచుక్కలాగా కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వచ్చారు. తెలంగాణ భౌగోళిక, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ అణచివేతలను వివిధ కోణాల్లో అధ్యయనం చేసి ఉద్యమ వ్యూహాలను రూపొందించుకోవడంలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. చివరకు తన పదవులకు రాజీనామా చేసి 2001 ఏప్రిల్ 27న జలదృశ్యం వేదికగా టీఆర్ఎస్‌ను స్థాపించి, ప్రజలను ఉద్యమ పథంలో నడిపారు. చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు.

తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ ఎంత నిబద్ధతతో పని చేశారో.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ సమగ్ర అభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికతో అంతే నిబద్ధతతో కృషి చేశారు. ఒకనాడు ఆంధ్రా పాలకులు వ్యవసాయం దండగ అన్న చోటే వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. మిషన్ భగీరథ, 24 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్తు, ఐటీ, పారిశ్రామికరంగాల్లో వృద్ధి, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాల కల్పన, కులవృత్తులకు చేయూత, ఆసరా పింఛన్లు అందజేశారు. దశాబ్దం పాటు కొనసాగిన కేసీఆర్ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం గణనీయంగా పెరిగాయి. వినూత్న పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పును తీసుకొచ్చారు. కానీ, గత దశాబ్ద కాలంగా జరిగిన అభివృద్ధి 16 నెలల కాంగ్రెస్ పాలనలో తిరోగమనం చెందడం బాధాకరం.

శాంతియుతంగా సుదీర్ఘ కాలం పోరాటం చేసి, తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన స్వరాష్ర్టాన్ని సాధించి, దశాబ్దం పాటు అధికారంలో ఉండి తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలు జరుపుకొంటున్న వేళ దగాపడిన తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఈ రజతోత్సవ సభ మరో పోరాటానికి నాంది పలుకనున్నది.

-ప్రొఫెసర్ తాటికొండ రమేష్
(వ్యాసకర్త: పూర్వ వైస్ చాన్స్‌లర్, కాకతీయ యూనివర్సిటీ)

# నికార్సయిన భూమిపుత్రుడు కేసీఆర్



శ్రీశైల్ రెడ్డి పంజుగుల
90309 97371

తెలంగాణ ఉద్యమంలో టన్నులకొద్దీ మందుగుండు దట్టించి పేల్చిన ఫిరంగి లాంటి నినాదం 'తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో'! ఆ నినాదపు పరమార్థం ఉద్యమ నాయకుని ఉక్కు సంకల్ప ప్రకటనో; ఫలసిద్ధి అనంతరం నాయకునికీ, పార్టీకీ దక్కబోయే కీర్తియో; ఇతర సంకుచిత ప్రయోజనాలో కాదు! దశాబ్దాలుగా పరాయి పాలన ప్రసాదించిన వివక్షకు బలై, అన్యాయాలపాలై, అవమానాలకు లోనై; సొంత నాయకుల మోసాలకు గురై, ఆశలు ఆవిరై, నీరుగారి ఉన్న తెలంగాణ ప్రజానీకం ఒక అచ్చమైన, స్వచ్ఛమైన ఉత్తేజం పొంది; కచ్చితంగా ముద్దాడి తీరబోయే లక్ష్యం పట్ల మొక్కవోని దీక్షతో యుద్ధానికి సిద్ధమైన తరుణంలో వచ్చిన పాంచజన్య శంఖపు పూరింపు 'తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో'! రణన్నినాదం!

ఈ సాయంత్రం జరుగబోయే ఎల్కతుర్తి సభలో ఎల్కతుర్తి సభలో కేసీఆర్ ఇచ్చే డైరెక్షన్ పట్ల తెలంగాణకు ఒక ఎరుక ఉన్నది, ఆశా ఉన్నది. ఆయన వస్తే తప్ప బతుకు బాగుపడదని కాంగ్రెస్ ప్రభుత్వం ఓవర్ టైం పనిచేసి మరీ ప్రజలకు తెలియజెప్తున్నది. బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరపకుండా ఆపాలని నెలరోజుల పాటు వరంగల్‌లో సభలు, సమావేశాలు రద్దు అంటూ ఆర్డర్ పాస్ చేసినపుడే బీఆర్ఎస్ పాసైంది. ఆ పార్టీ వాల్ రైటింగ్స్‌ను కాంగ్రెస్ నాయకులు చెరిపివేస్తున్నపుడే జనం గుండెల్లో కేసీఆర్ పేరు మరింత లోతుగా ముద్రించుకుపోవడం మొదలైంది! తెలంగాణను దరిచేర్చగలిగేది ఒక్క కేసీఆరే అనే భావన యావత్ ప్రజానీకంలో బలంగా వ్యాపించింది. తటస్థులు సైతం ఈ ప్రభుత్వం ఎంత త్వరగా పోతే, అంత మంచిదనుకునే దశకు వచ్చిన్రు. కాబట్టే, ఇపుడు 'కేసీఆర్ మళ్లొచ్చుడో, తెలంగాణ ఇక సచ్చుడో' అనే నినాదం నాటి ఉద్యమ నినాదానికి సీక్వెల్‌గా మారుతున్నది.



కేసీఆర్ సమర్థ పాలకుడే కాదు, లోతైన ఆలోచనలున్న దార్శనిక నాయకుడు. పిల్లలను పొదివి కాపాడే తల్లి కోడిలా తెలంగాణను కాపాడుకున్నరు. తన నేలపై ఆయన ప్రేమ ఎనలేనిది. ఆయనకు రాజకీయాలు వ్యాపకం కాదు, టాస్క్! 'కొంగులోనా దాచిపెట్టీ.. కొడుకిచ్చే ప్రేమ వేరూ...' అనే బలగం సినిమా పాటలాగ, తెలంగాణే ఆయన బలగం! కడుపు కట్టుకొని, సంపద పెంచి, అందరికీ పంచే తండ్రి లాంటి నాయకుడు కేసీఆర్.

ఏడాదిన్నర పాలనాలేమితో తెలంగాణ వందేండ్లు వెనక్కుపోయింది. రాష్ట్ర ఆదాయం 40 శాతం మేర పడిపోయింది. అన్ని శాఖలూ వాటి మంత్రుల లాగానే పడకేసినయి. ఒక్క ఆబ్కారీ తప్ప ఆదాయం వచ్చే మార్గాలే లేకుండా పోయినయి. సంపద సృష్టించే సమర్థత లేదు; 'వల్గర్ టు ది కోర్' వ్యక్తిత్వంతో ఇంటా బయటా ఎవరూ గౌరవించే పరిస్థితి లేదు; గూండా గిరీ 'గాంధీ' భవన్ నుంచే సాగుతుండటం ఒక విరోధాభాస! నిరసనలు, ఆందోళనలతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ సాహసించడం లేదు.

తెలంగాణ అస్తిత్వం, చైతన్యం అంటే అస్సలు స్పృహ లేని రేవంత్ రెడ్డికి దెబ్బ మీద దెబ్బ పడుతున్నది. జన బాహుళ్యం నుంచీ, పౌర సమాజం నుంచీ, న్యాయవ్యవస్థ నుంచీ ముప్పేట దాడులకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నరు. కంచ గచ్చిబౌలి, ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో న్యాయస్థానాల తీవ్ర వ్యాఖ్యలకు సిగ్గూ శెరం ఉండి ఉంటే తలదించుకునేవారు!

గత అసెంబ్లీ ఎన్నికల ప్రసంగాల్లో కేసీఆర్ స్పష్టంగా ఒక మాట చెప్పిన్రు 'నేను చెప్పిన అని మీరు నమ్మవలసిన పనిలేదు. మీ సొంత వివేచన చేయాలె' అన్నరు. ఎందుకంటే ఆయనకు ధైర్యం. తను చెప్పేవి నిజాలు అని! 'తప్పుడు హామీలు ఇవ్వను! సంపద పెంచుకుందాం, సంక్షేమం పంచుకుందాం. ఒక్కొక్కటిగా చేసుకుందాం, మీరు మాయలో పడకండి' అని నెత్తీనోరూ కొట్టుకున్నరు కేసీఆర్. అవన్నీ అధికారం కోసం, తన కుటుంబం కోసం అని ఆనాడు ఆడిపోసుకున్న వారు సైతం ఇప్పుడు ఆలోచిస్తున్నరు. మళ్లా కేసీఆర్ వస్తే తప్ప తెలంగాణ బతుకదంటూ నిర్ద్వంద్వంగా చెప్తున్నరు.

కేసీఆర్ అధికారం కోల్పోవడానికి వంద శాతం ప్రజల తప్పిదమే కారణమనడం లేదు. బీఆర్ఎస్ వైపు, అధినాయకుని వైపు, ప్రజాప్రతినిధుల వైపు వేలెత్తి చూపించగల తప్పులు జరిగి ఉన్నయని చెప్పడానికి పార్టీ అభిమాని అయిన ఈ వ్యాసకర్తకు ఎలాంటి భేషజం లేదు. వాస్తవాలు మాట్లాడితే అధిష్ఠానానికి ఆగ్రహం వస్తుందన్న వెరపూ లేదు. ఎందుకంటే పెద్దాయన మనసు తెలుసు కనుక! అయితే, ఒక్క విషయం మాత్రం స్పష్టం. కేసీఆర్ తప్పులు చేసి ఉండవచ్చు కానీ, రేవంత్‌లా మోసగాడు మాత్రం కాదు. ఆయన తప్పులు సరిచేసుకోగలిగినవే కానీ, రేవంత్‌లా శాశ్వత నష్టం చేసేవి కాదు. తెలంగాణలో నివసించే ఆంధ్ర ప్రాంతానికి చెందిన టీడీపీ అభిమానులు గత ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కోసం పనిచేసిన వారిలో కొందరు ఖమ్మం, హైదరాబాద్, ఆర్మూర్, అమెరికా నుంచి నాకు ఫోన్లు చేస్తున్నరు. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు తాము చెంపలు వేసుకుంటున్నామని నిజాయితీగా చెప్తున్నరు. ఉన్న మాట ఉలుకు లేకుండా చెప్పాలంటే వారికి పార్టీలు, నాయకులు, కులాల కంటే కూడా అభివృద్ధి ముఖ్యం. ఇపుడు తమ సొంత కుటుంబాలే గోస పడుతుంటే వారు ఊరుకోలేకపోతున్నరు. కాబట్టి.. ప్రజలను రేవంత్ ప్రభుత్వం పెడుతున్న గోస తెలిసి కూడా కేసీఆర్‌పై నిత్య అసంతృప్తితో, నిరంతర ద్వేషంతో నేటికీ విషం చిమ్ముతున్న వర్గాలు నిద్ర నటించటం ఆపాలి, కండ్లు తెరవాలి.

తెలంగాణ ప్రజానీకానికి రెండు ముగింపు మాటలు: ఒక దార్శనిక నాయకుడు; ఇంతకు ముందెన్నడూ లేనంత అభివృద్ధి, సంక్షేమం, ఆత్మగౌరవం తన ప్రజలకు హక్కుగా దక్కించిన నికార్సయిన భూమిపుత్రుడు కేసీఆర్ 27న వరంగల్ రజతోత్సవ సభలో చెప్పే మాటలు శ్రద్ధగా ఆలకించాలి. ఆయన మాటల్లోని నిజాయితీని, తెలంగాణను తిరిగి నిలబెట్టుకోవాలన్న ఆయన దృఢచిత్తాన్ని ఒళ్లంతా కళ్లు చేసుకొని చూడాలి, చెవులు చేసుకుని వినాలి. ఇప్పుడు కుదేలైన తెలంగాణను ఆరునూరైనా విజయ తీరాలకు చేర్చాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌తో పాటు తమపైనా ఉన్నదని గ్రహించాలని తెలంగాణ బిడ్డలకు సవినయ మనవి! జై తెలంగాణ!